సాక్షి
కుమురం భీం

శుక్రవారం । 20 । జనవరి । 2023



ఉచిత శిక్షణతో ఉజ్వల భవిష్యత్
ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచితంగా ఎంసెట్ కోచింగ్ అందించనున్నారు. ఇప్పటికే జిల్లాలోని అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ అందించారు. 9లో▸



మెస్రం వంశీయుల పూజలు
ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో మెస్రం వంశీయుల పూజలు కొనసాగుతున్నాయి. కేస్లాపూర్ సమీపంలోని మర్రిచెట్టు వద్ద వంశస్తులందరూ బస చేశారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
31.3 /18.4

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. గాలిలో తేమ తగ్గుతుంది. మధ్యాహ్నం ఎండగా అనిపిస్తుంది. చలి ప్రభావం తగ్గుతుంది.

కంటి సమస్యలకు చెక్

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- జిల్లా వ్యాప్తంగా కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం



కంటి పరీక్షలు చేయించుకున్న అనంతరం ఎమ్మెల్యే సక్కుకు అద్దాలు తొడుగుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆసిఫాబాద్‌రూరల్: కంటి వెలుగు కార్యక్రమంతో ప్రజల కంటి సమస్యలకు చెక్ పడనుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఆసిఫాబాద్ మండలం చిర్రకుంట గ్రామంలో గురువారం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎస్పీ సురేశ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 26 శిబిరాలు ఏర్పాటు చేసి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేయాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆత్రం సక్కు కంటి పరీక్షలు చేయించుకున్నారు. జిల్లా డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లన్న, ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, సర్పంచ్ పార్వతి, నాయకులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

కాగజ్‌నగర్‌టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరికి చూపు బాగుండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందని పేర్కొన్నారు. కంటి చూపు మందగించి డబ్బు సమస్యతో ఆస్పత్రుల్లో చూపించుకోలేక అవస్థలు పడుతున్న పేద కుటుంబాలకు ఇది వరంలాంటిదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, వైస్ చైర్మన్ రాచకొండ గిరీష్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నిర్మూలనే లక్ష్యం



రెబ్బెనలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న అదనపు కలెక్టర్ రాజేశం

రెబ్బెన(ఆసిఫాబాద్): రాష్ట్రంలో అంధత్వ నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని అదనపు కలెక్టర్ రాజేశం అన్నారు. రెబ్బెన మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ప్రారంభించారు. శిబిరాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ స్వయంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. ప్రజలకు అందజేస్తున్న అద్దాల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో సీపీవో రవీందర్, సర్పంచ్ అహల్యాదేవి, ఎంపీటీసీ మధునయ్య, సీఐ అల్లం నరేందర్, ఎస్సై భూమేశ్, తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో అంజద్‌పాషా, డాక్టర్లు రాకేశ్, ప్రవీణ్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, నాయకులు శంకరమ్మ పాల్గొన్నారు.

తొలిరోజు 3,012 మందికి కంటి పరీక్షలు

ఆసిఫాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా తొలిరోజు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన శిబిరాల్లో 3,012 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా కాగజ్‌నగర్ మున్సిపాలిటీతో పాటు 335 గ్రామ పంచాయతీల పరిధిలోని 26 వైద్యబృందాలతో కంటి పరీక్షలు నిర్వహించారు. మొదటి రోజు 441 మందికి రీడింగ్ అద్దాలు అందజేశారు. వీరిలో 40 ఏళ్ల వయస్సు లోపు 37 మంది, 40 ఏళ్ల పైబడిన వారు 404 మంది ఉన్నారు. అలాగే 608 మందికి కొత్త కళ్లద్దాల కోసం ఆర్డర్ చేశారు. 1,523 మందికి ఎలాంటి కంటి సమస్యలు లేనట్లు గుర్తించినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

న్యూస్‌రీల్

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఏవో శ్రీనివాసరావు

చింతలమానెపల్లి(సిర్పూర్): చింతలమానెపల్లి మండలం లంబాడిహేటి, బాబాపూర్ గ్రామాల్లో పంటలను జిల్లా వ్యవసాయ అధికారి రావూరి శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. మండల వ్యాప్తంగా యాసంగి పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. ఆయా గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. యాసంగి పంటల వివరాలను తప్పకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ నమోదు ద్వారా ఆయా పంటల విస్తీర్ణం, దిగుబడి వివరాలను గణిస్తామని పేర్కొన్నారు. ఈ వివరాల ఆధారంగా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయిస్తుందని తెలిపారు. ఆయన వెంట ఏవో రామకృష్ణ, ఏఈవో రాజేశ్వర్, రైతులు ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వివిధ యువజన సంఘాల నాయకులు గురువారం జిల్లా కేంద్రంలో డీఈవో అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన ఊరు– మన బడి కార్యక్రమం పనుల్లో నాసిరకం పనుల్లో చేస్తూ ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్, కేవీపీఎస్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు చిరంజీవి, దినకర్, కార్తీక్, నాయకులు సాయిరాం, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

బెజ్జూర్: ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత లభిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. చెప్రాల ఆధ్యాత్మిక కేంద్రాన్ని గురువారం బీజేపీ నాయకుడు హరీశ్ బాబుతో కలిసి సందర్శించారు. కార్తీక స్వామి చిత్రపటంతో భక్తులు ఊరేగింపు నిర్వహించారు. బెజ్జూర్ మండలం ఎలుకపల్లి(బి) అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన మహా పాదయాత్ర బుధవారం రాత్రి మహారాష్ట్రలోని చెప్రాల ఆధ్యాత్మిక కేంద్రానికి చేరుకుంది. ఆలయంలోని మూల విరాట్ హనుమాన్, కార్తీక స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం కార్తీక స్వామి సమాధిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్‌రావు, మాజీ ఎంపీపీ కొప్పుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నాగోబా దర్శనానికి అమ్మ



ఆదివాసీల ఆరాధ్యదైవం జంగుబాయి ఉత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని కేస్లాపూర్‌లో శనివారం నుంచి ప్రారంభం కానున్న నాగోబా పూజకు నేటి రాత్రి జంగుబాయి అమ్మవారు తరలి వెళ్తుందని భక్తులు నమ్ముతారు. గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూజలు నిర్వహించారు.

- వివరాలు 8లో▸

కలెక్టరేట్ పనులు త్వరగా పూర్తిచేయాలి



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే కోనప్ప

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో కొత్తగా నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ నూతన భవనం పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన నిర్మాణ ప నులను గురువారం ఆర్‌అండ్‌బీ ఈఈ పెద్ద న్న, ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో కలిసి పరి శీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమీకృత కలెక్టరేట్ భవనంలో అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉంటార ని, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు వేగంగా అందుతాయన్నారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు వీలుగా పూలు, పండ్ల మొక్కలు నాటాలని ఉద్యానవన శాఖ అధికారి నదీంను ఆదేశించారు. అదనపు బోరు పనులను పూర్తి చేయాలని, అన్ని గదులకు తాగునీరందించే విధంగా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ ఈఈ వెంకటపతిని ఆదేశించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి ఉమామహేశ్వరి

ఆసిఫాబాద్‌రూరల్: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఉమామహేశ్వరి అన్నారు. మండలంలోని మోతుగూడ పాఠశాల విద్యార్థులకు గురువారం చట్టాల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతో సమాజంలో ఉన్నతంగా ఎదగవచ్చారు. పలు చట్టాల గురించి వివరించారు. న్యాయమూర్తులు విద్యాసాగర్, రాజిరెడ్డి, నరహరి, ఎస్సై రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రానీయొద్దు

- ప్రజలకు భగీరథ నీటిని పూర్తిస్థాయిలో అందించాలి
- జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి
- జెడ్పీ సమావేశ మందిరంలో స్థాయీ సంఘాల సమావేశం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

ఆసిఫాబాద్: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన స్థాయీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్పతో కలిసి వివిధ ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షించారు. కోవ లక్ష్మి మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ తాగునీరు సక్రమంగా అందడం లేదన్నారు. ఆ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాజెక్టుల ద్వారా రైతులకు సాగు నీరందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వట్టివాగు ప్రాజెక్టు ఆధునీకరణకు మంజూరైన రూ.30 కోట్ల పనులకు టెండర్లు ఎప్పుడు పిలుస్తారని అధికారులను ప్రశ్నించారు. జైనూర్, సిర్పూర్(యూ) మండలాలతో పాటు ఆసిఫాబాద్ మండలంలోని అడ, దస్నాపూర్‌లో కొత్తగా చెక్‌డ్యాంలు నిర్మించాలని సూచించారు. కుమురం భీం ప్రాజెక్టు కుడి కాల్వ నిర్మించినా రైతులకు సాగు నీరందకపోవడంపై చైర్‌పర్సన్ అసహనం వ్యక్తం చేశారు. కుమురంభీం ప్రాజెక్టు కాల్వల పనుల్లో భాగంగా కొత్తగా చిన్న స్లూయిస్ నిర్మించాలని సిర్పూర్ ఎమ్మెల్యే కోనప్ప కోరారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ జైనూర్ మండలం చింతకర్ర డీలర్‌కు ఎమ్ఎల్ఎస్ పాయింట్ గోదాం నుంచి బియ్యం తూకంలో ఎందుకు తక్కువ ఇస్తున్నారని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డీఎస్‌వో తారామణిని ఆదేశించారు. రెబ్బెన మండలం తక్కళ్లపెల్లిలో 400 మంది లబ్ధిదారులు రోళ్లపాడుకు వెళ్లి రేషన్ సరుకులు తీసుకుంటున్నారని, అక్కడ కొత్త దుకాణం ఏర్పాటు చేయాలని సూచించారు.

లింక్ బస్సులు ఏర్పాటు చేయాలి..

జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్ వెళ్లే సూపర్ లగ్జరీ సర్వీసులు వయా కాగజ్‌నగర్ మీదుగా వెళ్లడంతో ప్రయాణికులపై ఆర్థిక భారం పడటంతోపాటు సమయం వృథా అవుతుందన్నారు. అలాంటి సర్వీసులకు క్రాస్‌రోడ్ వరకు లింక్ బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ టీఐ– 2 సత్యనారాయణకు సూచించారు. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ నుంచి మంచిర్యాలకు బెల్లంపల్లి లేకుండా డైరెక్టు బస్సులు నడపాలన్నారు. నేషనల్ హైవేలో కోల్పోయిన బస్టాండ్ షెల్టర్ల వివరాలు ఇవ్వాలని, ఆ ప్రాంతాల్లో కొత్త బస్‌షెల్టర్లు నిర్మించాలన్నారు. ఆదిలాబాద్ నుంచి ఆసిఫాబాద్ వచ్చే బస్సులు వయా లోకారీ మీదుగా కొన్నిబస్సులు నడపాలని కెరమెరి జెడ్పీటీసీ ద్రుపదాబాయి కోరారు. గురుకులాల ఆర్సీవోలు ప్రజాప్రతినిధులు విన్నవించే సమస్యలపై స్పందించడం లేదన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో రత్నమాల, జెడ్పీటీసీలు కోవ అరుణ, అజయ్‌కుమార్, శ్రీరామారావు, కోఆప్షన్ సభ్యుడు సిద్దిక్ మహ్మద్, ఆర్‌అండ్‌బీ ఈఈ పెద్దన్న, పంచాయతీరాజ్ ఈఈ రామ్మోహన్ రావు, మిషన్‌భగీరథ ఈఈ వెంకటపతి, డీపీవో రమేశ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సేవల్లో కీలకం.. భవిష్యత్తు ప్రశ్నార్థకం

- 15 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలోనే విధులు
- చాలీచాలని వేతనాలతో తప్పని తిప్పలు
- అవస్థలు పడుతున్న సెకండ్ ఏఎన్‌ఎంలు
- జిల్లాలో 160 మంది సిబ్బంది
- సమస్యల పరిష్కారం కోసం ఆందోళన బాట



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

తిర్యాణి(ఆసిఫాబాద్): ప్రభుత్వ చేపట్టే వైద్యారోగ్య సర్వేలో క్షేత్రస్థాయిలో వారి సేవలు చాలా కీలకం. వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, వైద్యసేవలందించడంలోనూ ముందుంటారు... 15 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలకు ఉద్యోగ భద్రత కరువైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న తాము చాలీచాలని వేతనాలతో తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


2008 నుంచి..

జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా జిల్లా వ్యాప్తంగా 2008 నుంచి 160 మంది సెకండ్ ఏఎన్‌ఎంలు విధులు నిర్వర్తిస్తున్నారు. నియామకం నుంచీ వీరు కాంట్రాక్ట్ పద్ధతిలోనే పనిచేస్తున్నారు. వీరికి ప్రస్తుతం నెలకు రూ.27వేల వేతనం చెల్లిస్తున్నారు. దాదాపు 15 ఏళ్లుగా వైద్యశాఖలో సేవలందిస్తున్న తమను క్రమబద్ధీకరించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోతుందని వాపోతున్నారు. కనీసం రెగ్యులర్ ఏఎన్‌ఎంల మాదిరిగా యూనిఫాంలు, అలవెన్స్‌లు కూడా అమలు చేయడం లేదు. ప్రమాదవశాత్తు విధి నిర్వహణలో మృతిచెందినా కనీసం ఎక్స్‌గ్రేషియా కూడా అందని దుస్థితి నెలకొందని ఆరోపిస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రెండో ఏఎన్‌ఎంలు సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆందోళన చేపట్టారు. తాజాగా జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు.

క్షేత్రస్థాయిలో అనేక పనులు

గ్రామాల్లో రెండో ఏఎన్‌ఎంలు అనేక రకాల వైద్య సేవలు అందడంలో కీలకంగా మారారు. మహిళలు గర్భం దాల్చిన సమయం నుంచి ప్రసూతి అయ్యేంత వరకు వారి పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రసూతి అనంతరం కేసీఆర్ కిట్ అందజేస్తారు. అలాగే ప్రతీ శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించి పల్లెల్లో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలను నమోదు చేసుకుని తగిన చికిత్స అందేలా చూడాలి. వైద్యసేవలకు సంబంధించిన ప్రతీ విషయాన్ని ఆన్‌లైన్‌లో పొందుపర్చడం వీరి ప్రధాన విధి.


ఉద్యోగ భద్రత కల్పించాలి



మొదటి నుంచీ కాంట్రాక్ట్ పద్ధతిలోనే పనిచేస్తున్న. మాకు ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులర్ చేయాలి. ప్రస్తుతం అందుతున్న చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతన్నాం. ప్రభుత్వం మా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– పుణ్యబాయి, రెండో ఏఎస్‌ఎం, బాబాపూర్


క్రమబద్ధీకరణ చేపట్టాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రతీ ఆరోగ్య పథకాన్ని పజల్లో తీసుకెళ్లి విజయవంతం చేస్తున్నాం. కేసీఆర్ కిట్ మొదలుకుని కంటి వెలుగు కార్యక్రమం వరకు మేమే ముందుండి నిర్వహిస్తున్నాం. మా కష్టాలను చూసి సెకండ్ ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించాలి.

– మీనా, రెండో ఏఎస్‌ఎం, కౌటాల

పోరాటం కొనసాగిస్తాం



రెండో ఏఎన్‌ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తాం. గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి.

– బోగే ఉపేందర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

చిరు ధాన్యాలతో ఆరోగ్యం



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

ఆసిఫాబాద్: చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని ఏఎంసీ చైర్మన్ గాదెవేణి మల్లేశ్ అన్నారు. 2023 సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో గురువారం రైతులతో కలిసి కోర్టు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సంప్రదాయ పంటలు పండించాలని, మన దేశీయ పంటే మన పండుగలని పేర్కొన్నారు. మండల వ్యవసాయాధికారి ఖాదర్ హుస్సేన్ మాట్లాడుతూ చిరు ధాన్యాల సాగుతో పెట్టుబడి తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. అలాగే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. అనంతరం రైతులకు చిరు ధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సిడాం రాము, స్రవంతి, గంట రాము, గ్రామస్తులు వైరాగడే శంకర్ పటేల్, హరేందర్ నాందేవ్, దశరథ్, ఆకాశ్, కవల్కర్ పెంటు, లక్ష్మణ్, విఠల్ పాల్గొన్నారు.

‘అండర్‌పాస్’ కోసం ఆందోళన బాట

- జెడ్పీ పాఠశాల ఎదుట నిర్మించాలని విద్యార్థి సంఘాలు..
- శివాజీ చౌక్ వద్ద ఏర్పాటు చేయాలని వ్యాపారులు, పలు గ్రామాల ప్రజల డిమాండ్
- జాతీయ రహదారిపై పోటాపోటీగా రాస్తారోకో



ఆందోళనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

వాంకిడి(ఆసిఫాబాద్): జాతీయ రహదారి– 363 పనుల్లో భాగంగా వాంకిడి మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న వీయూపీ (వెహికల్ అండర్‌పాస్) బ్రిడ్జి నిర్మాణం వివాదాస్పదం అవుతోంది. జెడ్పీ పాఠశాలకు ఎదురుగా నిర్మించాలని విద్యార్థి సంఘాలు.. శివాజీచౌక్ వద్ద చౌపన్‌గూడ కేంద్రానికి వెళ్లే రహదారిపై నిర్మించాలని స్థానిక వ్యాపారులు, పలు గ్రామాల ప్రజలు పోటాపోటీగా ఆందోళనకు దిగారు. వాంకిడిలో నిర్మిస్తున్న అండర్‌పాస్ బ్రిడ్జిని కొంత మందికి అనుకూలంగా నిర్మిస్తున్నారని బుధవారం సాయంత్రం స్థానికులు అడ్డగించిన విషయం తెలిసిందే. దీంతో గురువారం విద్యార్థి సంఘాలతో కలిసి కొంత మంది స్థానికులు, వ్యాపారులతో కలిసి మరికొంత మంది స్థానికులు రెండు వర్గాలుగా విడిపోయారు. పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు రాస్తారోకో నిర్వహించి, విద్యార్థుల రాకపోకలకు అనుకూలంగా స్కూల్ ఎదుట అండర్‌పాస్ నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం మరో వర్గం నాయకులు శివాజీచౌక్ వద్ద రాస్తారోకో నిర్వహించి, 20 గ్రామాలకు అనుకూలంగా ఉండే చౌపన్‌గూడ రహదారిపైనే అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని నిరసన తెలిపారు. అధికారులు హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదంటూ రహదారిపై అరగంట పాటు బైఠాయించారు. రెవెన్యూ అధికారి ఘటన స్థలానికి చేరుకుని ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు తహసీల్దార్ రహీముద్దీన్ వినతిపత్రం అందించారు.

క్లుప్తంగా

స్పోర్ట్స్ అథారిటీలో చేరికలు

మంచిర్యాలటౌన్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్, లాల్‌బహదూర్ స్టేడియంలో వివిధ క్రీడల్లో శిక్షణ నిమిత్తం చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. 12 నుంచి 18 ఏళ్ల వయస్సు గల వారిలో బాలికలకు అర్చరిలో, అథ్లెటిక్స్‌లో బాలురు, బాలికలు నాన్ రెసిడెన్షియల్, హాకీ బాలికలు, బాలురు రెసిడెన్షియల్, కబడ్డీ బాలురు రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్, జిమ్నాస్టిక్స్ బాలికలు, బాలురు నాన్ రెసిడెన్షియల్‌లో ఉంటూ శిక్షణ పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు ఓఎస్‌డీ టీఎస్ఎస్ఎస్, హకీంపేట్‌లో సంప్రదించాలని తెలిపారు.

హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ హుండీని గురువారం లెక్కించారు. 51 రోజుల హుండీలో రూ.53,24,420 నగదు, 102 గ్రాముల మిశ్రమ బంగారం, 4.060 కిలోల వెండి, 18 విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన, స్టేట్‌బ్యాంక్ సిబ్బంది, ఎస్సై, వాగ్దేవి సొసైటీ సభ్యులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీజ్‌చేసిన ఆటో

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని డాడానగర్ బస్టాండ్ సమీపంలో గురువారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారి వివరాల ప్రకారం... బెల్లంపల్లి, మందమర్రి పట్టణ ప్రాంతాల నుంచి కాగజ్‌నగర్ మీదుగా మహారాష్ట్రకు ఆటోలో తరలిస్తున్న 3.50 క్వింటాళ్ల బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఆటోను సీజ్ చేసి డ్రైవర్ సురేశ్‌పై కేసు నమోదు చేసి పట్టుకున్న బియ్యంతో పాటు ఆటోను కాగజ్‌నగర్ రూరల్ పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై సందీప్ పాల్గొన్నారు.

పర్సు అప్పగింత

నిర్మల్‌చైన్‌గేట్: బస్సులో దొరికిన పర్సును పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి. బుధవారం హైదరాబాద్ నుంచి నిర్మల్‌కు బయలు దేరిన రాజధాని బస్సులో జిల్లా కేంద్రానికి చెందిన ఉద్గిర్ భూమన్నకు పర్సు దొరికింది. దులో రూ.9వేల నగదుతో పాటు ఏటీఎం కార్డులు ఉన్నాయి. వివరాలను పరిశీలించగా ఆర్మూర్ మండలం మామిడిపల్లికి చెందిన నదీమ్ మోహిద్దీన్‌కు చెందినట్లుగా గుర్తించాడు. పర్సును తీసుకుని నేరుగా పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. వివరాలను పరిశీలించిన పోలీసులు నదీమ్ మోహిద్దీన్‌ను పిలిపించి పర్సు అందజేశారు. పర్సును ఇచ్చిన భూమన్నను పట్టణ పోలీసులు అభినందించారు.

సాగులో సాంకేతికతతో మేలు



డ్రోన్ సాయంతో మందుల పిచికారీ

కడెం: సాగులో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో మేలు చేస్తుందని ఖానాపూర్ ఏడీఏ సుజాత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సీడ్ ఫాంలో డ్రోన్ సహాయంతో పురుగు మందు పిచికారీని పరిశీలించారు. డ్రోన్‌తో కూలీల సమస్య తీరడంతో పాటు, సమయం ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో సంధ్యారాణి, ఏఈవోలు ఉన్నారు.



మైసమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



డోలాతో వస్తున్న మహిళలు



అమ్మ దర్శనానికి వెళ్తూ..

ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ..



రావిచెట్టు వద్ద పూజల్లో..



నాగోబా దర్శనానికి అమ్మ

- నేటితో ముగియనున్న జంగుబాయి ఉత్సవాలు
- మొక్కులు తీర్చుకున్న 356 మేళాలు
- నెలరోజుల పాటు కొనసాగిన జాతర
- తెలంగాణ నుంచే అధిక భక్తులు

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీల ఆరాధ్యదైవంగా భావించే జంగుబాయి ఉత్సవాలు నేటితో ముగియనున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని కేస్లాపూర్‌లో శనివారం నుంచి ప్రారంభం కానున్న నాగోబా పూజ నేపథ్యంలో నేటి రాత్రి జంగుబాయి కేస్లాపూర్‌కు చేరుకుంటుందని భక్తుల నమ్మకం. శుక్రవారం ఉత్సవాలు ముగింపు కావడంతో గురువారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సుమారు 356 మేళంలు జంగుబాయిని దర్శించుకున్నాయి. 2లక్షలా 53 వేలకు పైగా భక్తులు హాజరైనట్లు కమిటీ సభ్యులు కొడప జాకు, మరప బాజీరావు తెలిపారు.

నేడు దేవతల శుద్ధీకరణ

నేడు మధ్యాహ్నం 2గంటలకు సిద్దికస, దారికస, విజ్జకస, టొప్లకస ప్రాంతాల్లోని పవిత్ర నదుల్లో నుంచి గంగాజలాన్ని తీసుకొచ్చి దేవతా విగ్రహాలను శుద్ధిచేస్తారు. శనివారం కేస్లాపూర్‌లో ప్రారంభం కానున్న నాగోబా దేవతా ఉత్సవాలకు అమ్మవారు వెళ్లనుండడంతో అదే రోజు చివరిగా కటోడాలు ఖరారు చేశారు. దేవతల శుద్ధి కార్యక్రమంతో జంగుబాయి ఉత్సవాలు ముగుస్తాయి.

జువైనల్.. జస్టిస్!

- నాలుగు జిల్లాల్లో జువైనల్ కోర్టుల ప్రారంభం
- బాల నేరాల పరిష్కారం వేగవంతం
- వారానికోసారి విచారణ



మంచిర్యాల జిల్లా జువైనల్ కోర్టు ప్రారంభించిన న్యాయమూర్తి ఉపనిషధ్వని



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జువైనల్ కోర్టు

మంచిర్యాలక్రైం: బాల నేరస్తులకు సంబంధించిన కేసుల విచారణ ఇప్పటి వరకూ ఉమ్మడి ఆదిలాబాద్‌లోనే కొనసాగుతోంది. విచారణ వేగవంతం చేయాలనే ఉద్దేశంతో ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల్లో జువైనల్ కోర్టులు ఏర్పాటు చేశారు. దీంతో ఏ జిల్లాకు సంబంధించిన కేసులను ఆయా జిల్లాలకు బదిలీ చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ఎదురుగా ఉన్న బాలసదన్ కార్యాలయంలో ఈ నెల 12న జువైనల్ కోర్టును ప్రారంభించారు. ఇన్‌చార్జి న్యాయమూర్తిగా జూనియర్ సివిల్ జడ్జి ఉపనిషధ్వని, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సహినా సుల్తానా, సూపరింటెండెంట్‌గా మహ్మద్ షఫీ కొనసాగనున్నారు.

కక్షిదారులు, న్యాయవాదులకు ఊరట...

జిల్లా కేంద్రంలో జువైనల్ కోర్టు ఏర్పాటు కావడంతో ఇటు కక్షిదారులు, అటు న్యాయవాదులకు ఊరట లభించింది. ఇదివరకు జిల్లాకు చెందిన బాల నేరస్తులకు సంబంధించిన కేసులన్నీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జువైనల్ కోర్టులో న్యాయవిచారణ జరిగేవి. మంచిర్యాల నుంచి ఆదిలాబాద్‌కు వెళ్లాలంటే 150 కిలోమీటర్ల దూరం 4 నుంచి 5గంటల వరకు ప్రయాణం చేయాల్సి వచ్చేది. కొన్ని సందర్భాల్లో అక్కడే ఉండాల్సి రావడంతో అనేక ఇబ్బందులు పడ్డారు. పైగా కోర్టు టైం అయిపోయే సరికి మంచిర్యాలకు వచ్చేందుకు బస్సులు లేకపోవడంతో కక్షిదారులు బస్టాండులోనే బస చేసిన సందర్భాలున్నాయి. ఎట్టకేలకూ జిల్లా కేంద్రంలో జువైనల్ కోర్టు ఏర్పాటుతో కక్షిదారులు, న్యాయవాదులకు సమయం, డబ్బులు ఆదా కానుంది. అంతేకాకుండా కేసుల విచారణ సైతం త్వరగా పూర్తయ్యే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాలో బాల నేరస్తుల కేసులు

మంచిర్యాల :	70
ఆదిలాబాద్ :	74
ఆసిఫాబాద్ :	80
నిర్మల్ :	136

బాలనేరస్తుల నియంత్రణకు కృషి చేయాలి



బాల నేరస్తుల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి. సోషల్ మీడియా, ఇంటర్‌నెట్ సెల్‌ఫోన్లు యువతను, మైనర్లను పెడదోవ పట్టిస్తున్నాయి. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి. ఎవరితో మాట్లాడుతున్నారు. వారి స్నేహితుల వివరాలను సైతం తెలుసుకోవాలి. తల్లిదండ్రులు ఎక్కువ సమయం పిల్లలతో సరదాగా గడుపుతు వారితో కాలక్షేపం చేసినప్పుడు వారి మానసిక స్థితిని, వారి ప్రవర్తనలో మార్పును గమనించాలి.

– అఖిల్ మహాజన్, ఇన్‌చార్జి డీసీపీ, మంచిర్యాల

జువైనల్ కోర్టు ఏర్పాటు అభినందనీయం



జిల్లాలు ఏర్పడిన చాల కాలం తర్వాత జిల్లా జువైనల్ కోర్టు ఏర్పాటు చేయడం అభినందనీయం. దీంతో కక్షిదారులకు చాల మేలు జరుగుతోంది. సామాన్య మానవుడు ఆదిలాబాద్ వెళ్లాలంటే వారిని కొన్ని సందర్భాల్లో న్యాయవాదులే డబ్బులిచ్చి తీసుకెళ్లాల్సి వచ్చేది. ఎంతో ప్రయసాలకు ఓర్చి వెళ్లిన కొన్ని సందర్భాల్లో కోర్టు సమయానికి వెళ్లకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. తిప్పలు తప్పుతాయి.

– సహినా సుల్తానా, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, జువైనల్ కోర్టు, మంచిర్యాల

కేసులు త్వరగా పరిష్కారం అవుతాయి



జిల్లాలో జువైనల్ కోర్టు ఏర్పాటు కావడం అభినందనీయం. దీంతో బాల నేరస్తులకు సంబంధించిన కేసులు త్వరగా పరిష్కరించబడుతాయి. జిల్లాకు మహిళా కోర్టు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. జిల్లాలో 2004 నుంచి జిల్లా కేంద్రంలో కోర్టులు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. 42 సర్వే నంబర్‌లో 5ఎకరాల స్థలం కేటాయించడం జరిగింది. త్వరగా నిర్మించాలి.

– రవీందర్‌రావ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, మంచిర్యాల

ఎమ్మెల్యేకు నిరసన సెగ

- నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరైన సెకండ్ ఏఎన్ఎంలు



దండేపల్లి: కొండాపూర్‌లో నల్లబ్యాడ్జీలతో విధుల్లో పాల్గొన్న సెకండ్ ఏఎన్ఎంలు.

దండేపల్లి: కంటి వెలుగు కార్యక్రమంతో అందరి జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం కేసీఆర్ కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేసి తమ జీవితాల్లో వెలుగులు నింపాలని సెకండ్ ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. దండేపల్లి మండలం కొండాపూర్‌లో గురువారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో నల్లబ్యాడ్జీలు విధుల్లో పాల్గొన్నారు. కార్యక్రమ పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యే దివాకర్ రావు ఎదుట నిరసన తెలిపారు. 15 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని, తమ డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేకు విన్నవించారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



అదనపు గదులకు భూమిపూజ చేస్తున్న మంత్రి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

లక్ష్మణచాంద(నిర్మల్): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకే సీఎం కేసీఆర్ మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మన ఊరు–మన బడి పథకంలో భాగంగా మంజూరైన రూ.89 లక్షల నిధులతో చేపట్టనున్న పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాఠశాలలో అదనపు గదులు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, నీటి వసతి, బెంచీలువంటి 12 రకాల మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. జెడ్పీ సీఈవో సుధీర్ కుమార్, డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, ఎంపీపీ అడ్వాల పద్మ, జెడ్పీటీసీ రాజేశ్వర్, సర్పంచ్ ముత్యంరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు మోహన్, నాయకులు రమేశ్, క్రిష్టారెడ్డి, గణేశ్, ఈటెల శ్రీనివాస్, జహీరొద్దీన్, మల్లయ్య పాల్గొన్నారు.

రూ.లక్ష విలువైన గంజాయి పట్టివేత

- వివరాలు వెల్లడించిన సీఐ రఘుపతి



వివరాలను వెల్లడిస్తున్న సీఐ రఘుపతి

ఆదిలాబాద్‌రూరల్: మహారాష్ట్రలో గంజాయి విక్రయించేందుకు వెళ్తుండగా మావల, సీసీఎస్ పోలీసులు బుధవారం ఉమ్మడిగా దాడి చేసి దస్నాపూర్ సమీపంలో రూ.లక్ష విలువ చేసే గంజాయిని పట్టుకున్నారు. గురువారం మావల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదిలాబాద్ రూరల్ సీఐ రఘుపతి వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూర్ మండలానికి చెందిన దుతిరాజ్ ప్రశాంత్ జల్సాలకు అలవాటుపడ్డాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి సరఫరా చేయాలని నిర్ణయించుకున్నారు. తన మిత్రులతో కలిసి ఆంధ్రా, ఒరిస్సా సరిహద్దుల్లో గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌కు సరఫరా చేస్తున్నాడు. తనకు వరుసకు మామైనా మిలింద్ నిర్వతికి గంజాయి సరఫరాపై చెప్పాడు. ఈ నెల 14న ఇరువురు హైదరాబాద్ చేరుకొని ప్రశాంత్ తనకు ముందే పరిచయం ఉన్నా లక్ష్మణ్‌కు ఫోన్ చేశాడు. గంజాయి కావాలని తెలిపి ఇద్దరు కలిసి ఈలనె 15న భద్రాచలం చేరుకొని రాత్రి అక్కడే ఉన్నారు. లక్ష్మణ్ వీరిని సిలేరు దగ్గరకు రమ్మని చెప్పగా వారు మరుసాటి రోజు 16వ తేదీన సిలేరుకు వెళ్లారు. అతడు వీరికి గంజాయి నమూనాలు చూయించాడు. అది చూసిన ప్రశాంత్ రూ.10వేలు అడ్వాన్స్‌గా ఇచ్చి కిలోకు రూ.3వేల చొప్పున ఎనిమిది కిలోల గంజాయి కావాలని అడిగాడు. ఈ నెల 17న భద్రాచలం చేరుకుని లక్ష్మణ్ ప్రశాంత్‌కు ఫోన్ చేసి బస్టాండ్‌కు వెళ్లాలని, అక్కడ మాకు సంబంధించిన వ్యక్తి గంజాయి ప్యాకెట్లు ఇస్తాడని చెప్పారు. ప్రశాంత్, మిలింద్ ఇద్దరు బస్టాండుకు వెళ్లగా ఓ వ్యక్తి వచ్చి 8 కిలోల నాలుగు గంజాయి ప్యాకెట్లు ఇచ్చారు. దీంతో ప్రశాంత్ ఫోన్‌పే ద్వారా రూ.13వేలు పంపించాడు. 18వ తేదీన ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రకు వెళ్లేందుకు దస్నాపూర్ సమీపంలో ఆటో కోసం వేచి ఉండగా పోలీసులు పట్టుకుని తనిఖీ చేసి గంజాయి, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నాం. ఈ సమావేశంలో ఎస్సై విష్ణు వర్ధన్ ఉన్నారు.

కాజిపల్లిలో పందెం ఎద్దు మృతి

- ఘనంగా దహన సంస్కారాలు



మృతి చెందిన ఎద్దు వద్ద రైతు రాజన్న

భీమారం: మండంలోని కాజిపల్లి గ్రామానికి చెందిన రాజన్న అనే రైతుకు చెందిన పందెం ఎద్దు గురువారం మృతి చెందింది. దీనితో గ్రామంలోని రైతులే కాకుండా పలు ప్రాంతాలకు చెందిన వారు వెళ్లి మృతి చెందిన ఎద్దుని చూసి రైతును ఓదార్చారు. రెండేళ్ల క్రితం కొనుగోలు చేసిన ఎద్దు పందెంలో దిట్టగా మారిందని గ్రామస్తులు తెలిపారు. మంచిర్యాల జిల్లాలోనే కాకుండా ఉమ్మడి కరీంనగర్‌లోని పలు ప్రాంతాల్లో జరిగిన ఎద్దు పందేళ్ల పాల్గొని అనేక బహుమతులు సాధించిందని వారు తెలిపారు. రెండురోజుల క్రితం పెద్దపల్లి ప్రాంతంలోని నందగిరి గ్రామంలో జరిగిన ఎద్దుల పందెంలో పాల్గొనేందుకు వెళ్లగా కొంత అస్వస్థతకు గురి కావడంతో పందెం నుంచి తప్పించి ఇంటికి తీసుకువచ్చారు. అప్పటి నుంచి అస్వస్థతకు గురై గురువారం మృత్యువాత పడింది. ఇటీవలే రూ.3.50 లక్షలకు కొనుగోలు చేస్తామని పలువురు అడిగినా సదరు రైతు దానిని విక్రయించలేదు. ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం దహన సంస్కారాలు చేశారు.

వివాహిత ఆత్మహత్య



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై

తిర్యాణి: వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని దేవాయిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని చందుగూడలో గురువారం వెలుగుచూసింది. ఎస్సై రమేశ్ వివరాల ప్రకారం... తానుబాయి (36) భర్త లక్ష్మణ్ ప్రతిరోజు తాగి వచ్చి ఇంట్లో గొడవ పడేవాడు. తాగుడు మానేయాలని ఎన్నిసార్లు చెప్పినా వినకపోవడంతో మనస్తాపానికి గురై బుధవారం సాయంత్రం ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందింది. మృతురాలికి కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో, బైక్ ఢీ – నలుగురికి గాయాలు

బెజ్జూర్: ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొనగా నలుగురికి గాయాలైన ఘటన గురువారం మండలంలోని గొల్లబాయ్ చెరువు సమీపంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న గౌతురే పోచన్న, ఆటోలో వెళ్తున్న బెజ్జూర్ మండలానికి చెందిన లక్ష్మి, స్వప్న, సారక్కలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్‌సై వెంకటేష్ సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

వసతి గృహంలో కంప్యూటర్ చోరీ



పరిశీలిస్తున్న ఎస్సై లక్ష్మణ్

లక్సెట్టిపేట: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో కంప్యూటర్ చోరీ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై లక్ష్మణ్ వివరాల ప్రకారం.. ఐదు రోజులుగా విద్యాసంస్థలకు సంక్రాంతి సెలవులు రావడంతో హాస్టల్ మూసి ఉంచారు. బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి వసతి గృహంలోని కంప్యూటర్ ఎత్తుకెళ్లారు. సిబ్బంది గురువారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. చోరీకి గురైన కంప్యూటర్ విలువ సుమారు రూ.30వేలు ఉంటుందని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.